

# గుడ్ బై... మిస్టర్ రాజా!

★

* రచన : జంగంపల్లి శ్రీలక్ష్మీరాజమ్. *

అప్సర అపరంజి బొమ్మలా, అరవిరిసిన మందారంలా, ముద్దులొలుకుతూ, ఎనలేని తేజస్సుతో కళకళ లాడుతూ వుంటుంది. అజంతా శిల్ప సుందరిలా, ముగ్ధ మనోహరంగా, తెల్లని పాలరాతి బొమ్మలా, మిల మిల మెరిసి పోతూ ఉంటుంది. ఆమె నల్లని వాలుజడ నల్ల త్రాచులా నిగ నిగ లాడుతూ వుంటుంది. ఆమె గల గలా నవ్వుతుంటే, ఆ నవ్వులో సెల యేరు పారుతున్నట్టు వుంటుంది. ఆమె మృదు మధురమైన మాటల్లో మకరంధం కురుస్తుంది.

అప్సర ఒకే ఒక నవ్వుతో మద మెక్కిన ఏనుగునైనా లొంగ దీయగలదు. ఒక్కసారే ఒంటి కాలు మీద వేయి మందిని సహితం నడిపించగలదు. ఆమె తలచుకుంటే బళ్ళు-ఓడలు, ఓడలు-బళ్ళు అవుతాయి. అప్సర పట్ల రాజా అభిప్రాయాలివి.

రాజా నెల రోజుల క్రిందట తన క్లాసు రూంకి ఆనుకొని వున్న వరండాలో నించున్నప్పుడు అటు వేపుగా ఒక ఫియట్ కారు రివ్వున దూసుకుంటూ వస్తూ తనకెదురుగా ఆగింది. కారులోంచి దిగిన అమ్మాయిని చూసి రాజా కళ్ళు చెదిరి పోయాయి.

తరువాత కారు రివ్వున దూసుకు రావడమూ, ఆ అమ్మాయి తిన్నగా తన దగ్గరకే రావడమూ క్షణంలో జరిగి పోయాయి.

"ఏమండీ! ఎం. ఏ. సైకాలజీ ప్రీవియస్ క్లాస్ రూం, ఎక్కడ?" మృదు మధురమైన కంఠం ప్రశ్నించింది.

ఆ పిలుపుకి రాజా త్రోటుపాటు పడ్డా తమాయించు, కొని - "ఆరే మీరు కూడా ఎం. ఏ. సైకాలజీ యేనా?" చిన్న చిరునవ్వు తెచ్చుకుంటూ అన్నాడు.

"అవునండి, మీరు కూడా సైకాలజీయేనా?" ఎదురు ప్రశ్న వేస్తూ కళ్ళు చక్రాల్లా త్రిప్పిందామె.

"అవునండీ, ఇదే సైకాలజీ క్లాస్ రూం" అని చూపిస్తూ "అయినా ఈ రోజు క్లాసు లేదండీ, ప్రొఫెసర్ గారు ఎక్కడికో వెళ్ళారట. రేపటినుండి రండి" అంటూ ఉత్సాహంగా చెప్పాడు రాజా.

"అలాగా థాంక్సండీ" ఇన్ ఫర్ మేషన్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పింది.

"అన్నట్టు ఇంతకీ మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?" ఆసక్తితో అడిగాడు రాజా.

"అప్సర" మృదువుగా, నవ్వుతూ చెప్పి "వస్తానండి" అంటూ వెళ్ళిపోయింది.

అప్సరతో ఆ రోజు పరిచయం దగ్గర్నుంచి రాజాకి మనస్థిమితం లేదు. ప్రేమ జాడ్యంతో ప్రతిరోజూ అప్సరను అబ్జర్వ్ చేస్తున్నాడు. అప్సర ఎప్పుడూ ఖరీదైన చీరలే ధరిస్తుంది. గొప్ప మనుషులతోనే తిరుగుతుంది. ఖరీదైన కార్లోనే యూనివర్సిటీకి వస్తుంది.

అందం...... హోదా...... అంతస్తూ అన్నీ వున్న అమ్మాయి భార్యగా లభించడం కంటే జీవితంలో పొందవలసిన ఆనందం ఏముంది. "అప్సర నా సొంతమే అయితే, నా ప్రేమ సామ్రాజ్యానికి రాణిని చేస్తాను. జీవితాంతం ఆమెకు ఊడిగం చేస్తూ బ్రతుకుతాను." మనసులో శపథం చేసుకొన్నాడు రాజా.

అప్సరను అమితంగా ప్రేమిస్తున్నాడు రాజా. ఎటొచ్చీ తన దింతవరకూ "వన్ వే ట్రాఫిక్" గానే

C.K.C

ELEPHANT BRAND




Carnataka Knitting Co.

TIRUPUR - 638 602.

★

**Sales dapot:**

No. 4-6-213, PAN BAZAAR,

SECUNDERABAD - 500 003.

మిగిలిపోయింది. తన అభిప్రాయాన్ని ఆమె ముందుంచి ఆమె ఆమోదం కూడా తీసుకోవాలనుకున్నాడు రాజా.

మరునాడు యూనివర్సిటీలో అప్సర ఏకాంతంగా వున్న సమయం చూసుకొని తన అభిప్రాయాన్ని ఆమె ముందు పెట్టాడు రాజా. "అప్సర గారూ! నేను మిమ్మన్ని గాఢంగా ప్రేమిస్తున్నాను."

"అలాగా. నేను మిమ్మల్ని ప్రేమించడం లేదే?" కిసుక్కున నవ్వింది అప్సర.

"అలా అనకండి. మీరు కాదంటే నేను ఏమై పోతానో నాకే తెలియదు" దీనంగా అన్నాడు రాజా.

"ఏమైపోతారు?" కొంటెగా అడిగింది అప్సర.

"ఏమైపోతానా? కొన్నాళ్ళు పోయిన తరువాత గడ్డాలు, మీసాలు దట్టంగా పెంచుకొన్న ఓ సన్యాసి ఎవరో కాదు ఈ రాజాయే".

"అంటే మీరు సన్యాసం పుచ్చుకుంటారా?" గలగగా నవ్వుతూ అడిగింది అప్సర.

"నిస్సందేహంగా, మీరు నా ప్రేమను కాదనకండి, నాకు ఆస్తి, అంతస్తూ వున్నాయి. మా ఫాదర్ పెద్ద బిజినెస్ మ్యాగ్నెట్. సంఘంలో మంచి హోదా వుంది. మీ అంతస్తుకి మా అంతస్తేం తీసిపోదు" తన "క్యారెక్టర్" గురించి గర్వంగా చెప్పుకోసాగాడు రాజా.

"చూడండి మిస్టర్ రాజాగారూ! ప్రేమకు కావలసింది ఆస్తి, అంతస్తు, హోదా కాదండి. అంతకంటే ప్రధానమైంది వెన్నలాంటి మనస్సు."

"నాకూ వుంది కదండీ పాలమీగడలాంటి మనస్సు" రాజాగారు చటుక్కున అందుకున్నాడు.

"మీకు మనస్సు ఉండవచ్చు-కాదనడం లేదు. కానీ మీ ప్రేమకు కారణంగా, మీకు సరిపడే మనస్సే కావాలి.

"మీ మనస్సుకి సరిపడే మనసు కాదా! నాది" ఆవేదనగా అడిగాడు రాజా.

"అబ్బే అలా అనడం లేదు కాని, మనిద్దరి అభిప్రాయాలు ఉత్తర, దక్షిణ ధృవాలని నేను భావిస్తున్నాను. అందుకని మన ప్రేమ ఫలించదు. దయచేసి మీ ప్రయత్నాన్ని విరమించుకోండి. వస్తా!" అంటూ విసురుగా

వెళ్ళిపోయింది అప్సర.

అప్సర తనని తిరస్కరించిందని బాధపడలేదు రాజా. తనకి ఆ సమయంలో విసుగు చెందని విక్రమార్కుని కథలు గుర్తొచ్చాయి. గుర్తొచ్చిన కథల సారాంశాన్ని గుర్తెరిగి తన ప్రేమ ప్రయత్నాన్ని కొనసాగించగా, తేలిన సారాంశం ఏమిటంటే—

అప్సరకు కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. "కేవలం కట్నం కోసమే పెళ్ళాడే మగాళ్ళంటే ఆమెకి పరమ అసహ్యం. తనకాబోయే భర్త ఆదర్శవాదై యుండాలి, స్త్రీల హక్కులను సమర్థించే వాడై వుండాలి. భార్యను వంటింటికి మాత్రమే పరిమితం చేయకుండా భర్తతో బాటే సమానంగా బయట ప్రపంచంలో తిప్పాలి" అంతే.

* * *

అప్పటి నుండి రాజాగారు మారిపోయారు. ఎక్కడబడితే అక్కడ స్త్రీ జాతి సమస్యల మీద సానుభూతిగా ఉపన్యసించడం మొదలు పెట్టాడు. ఒకసారి యూనివర్సిటీలో "డిబేట్ కాంపిటేషన్స్" ఏర్పాటు చేశారు. ందాట్లో పాల్గొన్నాడు రాజా.

"ఉమెన్స్ లిబ్" గురించి అనర్గళంగా ప్రసంగించాడు రాజా. తరతరాలుగా స్త్రీ జాతి పురుష పెత్తనం క్రింద ఎలా అణగద్రొక్కబడ బోతున్నదో ఆవేశంగా మాట్లాడుతూ తన ఉపన్యాసం ముగించాడు.

ఉపన్యాసం విన్న శ్రోతలంతా చప్పట్లు చరిచారు ఎంతో ఉత్సాహంగా. వాళ్ళతో బాటే అప్సర మరింత గట్టిగా చప్పట్లు కొట్టింది. అంతే కాకుండా "రాజాగారికింత ఉన్నతాశయాలున్నాయా?" అంటూ ఆశ్చర్యపోయింది. ఈ మాటే రాజాతో చెప్పింది బిడియ పడుతూ...

"క్షమించండీ. మీ కింత ఉన్నతాశయాలు ఉన్నాయనుకోలేదు. మీరు చాలా బాగా మాట్లాడారు."

"థాంక్స్ మేడమ్! యువర్ బెస్ట్ కాంప్లిమెంట్స్"

Grams: "PULLICCAR"

Phone: 2259: Office
2871 }
2872 } PBX
2873 }

# Pulliccar Mills Limited

Post Boz No. 7

**TIRUCHENGODE - 637 211.**

**(Salem District)**

**Manufacturers of:**

**Reputed quality 'Indian' & 'Foreign' cotton yarn Counts: 20s, 30s, 34s, 38s, 40s, 60s, 80s and 100s in Hanks and Cones & Doubling for domestic & Export purposes.**

**Cloth: 30s x 30s: 57" Width Grey Sheeting etc., are being manufactured.**

★ Spindleage: 30236 ★ Doubling: 2800 ★ Automatic looms: 250

**"PULLICCAR" A name renowned for quality over three decades.**

# "SELEKT"

**Motors and Pumps**

IS, 325



**For :--EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE**




**Manufactured by :**

## CHITRA INDUSTRIES

**COIMBATORE - 641 005.**

Grams : "SELECT PUMP" Phone : 44548

—: సేల్స్ బ్రాంచ్ :—

## చిత్రా ఇండస్ట్రీస్

5-1-446, రాణిగంజ్

సికింద్రాబాద్-3 (ఎ.పి.) ఫోన్ : 77826

డిస్ట్రిబ్యూటర్స్ :

## లక్ష్మి ఏజెన్సీస్

రాణిగంజ్ : : సికిందరాబాద్-3.


అని చెబుతూ గాలి కొట్టిన బెలూన్లా అయ్యాడు రాజా.

"నేను...మిమ్మల్ని...ప్రేమిస్తున్నాను" అంటూ తుర్రున పారిపోయింది అప్సర. ఇంకేం ఎగిరిపోయింది బెలూన్ ఆకాశంలోకి...

* * *

నాన్నా! నేనొక అమ్మాయిని ప్రేమించాను. తండ్రి గదిలోకి అడుగు పెడుతూ గొంతు పెగిల్చాడు రాజా.

వ్వాట్ ప్రేమించావా? కనుబొమలు ఎగరేశాడు కోదండరావు.

అవును నాన్నగారు నేను లైఫ్‌పార్ట్‌నర్ని ఎన్నుకున్నాను, మీరు ఆశీర్వదించండి.

లైఫ్ పార్ట్‌నర్‌ని ఎన్నుకున్నావ్, బాగానే వుంది. ఎన్నిక ముందు మన అంతస్తును, హోదాను తగ్గ బిజినెస్ థింక్ వుందా? ఆసక్తిగా ప్రశ్నించాడు కోదండరావు.

ఓహో! అదా నాన్నా! రాజా మీ కొడుకు. బిజినెస్ థింకింగ్ లేకుండా ఏపనీ చేయడు.

అలా వుండాలి తండ్రికి దగ్గ కొడుకంటే. ఇంకేం శుభలేఖలు అచ్చువేయించు, గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు కోదండరావు కొడుకుని ఘనంగా మెచ్చుకుంటూ... మరునాడు అప్సర, రాజా కలిసి బీచ్ కెళ్ళారు. వారు ఒక మూలకు పోయి ఇసుక తిన్నెలో ఇద్దరు కూర్చున్నారు.

కొద్ది క్షణాలు గడిచాక...

అప్సరా! నువ్వు అచ్చం జయప్రదలా ఉంటావు. నీ అంత అందమైన స్త్రీ నాకు భార్యగా లభించడం నిజంగా నా పూర్వజన్మ పుణ్యఫలం, అప్సర కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు రాజా.

అబ్బా, మీరు మాత్రం నటభూషణ శోభన్ బాబులా లేరు? మీ అంతటి ఆదర్శవాది భర్తగా లభించడం నిజంగా నా అదృష్టమే!

లేదు అప్సరా! నేను నీకు తగిన వాడ్ని కాదు, అసలు నేను నీ చేతి ఏ గాజాగానో పుట్టవలసిన వాడ్ని. ముద్దుగా అన్నాడు రాజా.

ఈ మాట విన్న అప్సర ఒక్కసారిగా అదోలా అయిపోయింది. అంతవరకు వున్న సంతోషాల రేఖలు ఎగిరిపోయి, మోహంలో విషాద ఛాయలు పులుముకున్నాయి. ఇది చూసి రాజాగారు ఆందోళనతో అప్సరా! ఏమయింది

అలా ఉన్నావేం? ఆత్రుతగా అడిగాడు.

మీతో నిజం చెబితే మన ప్రేమ విఫలమై పోతుందేమోనని భయంగా వుందండీ బొంగురు పోయిన గొంతుకతో చెప్పింది అప్సర.

ఫర్వాలేదు చెప్పు ఆసక్తిగా అడిగాడు రాజా.

నేను చాలా పేదదాన్నండి. మీరనుకుంటున్నట్టు నేను డబ్బున్న దాన్నికాదు, నేను కట్టుకుంటున్న ఖరీదైన చీరలేవీ నావి కావు. నా ఫ్రెండ్ 'సంధ్యారాణి', ఆడే నన్ను దయతలచి, కట్టుకోడానికి చీరలు యిచ్చి వాళ్ళ కారులోనే తనతో పాటే యూనివర్సిటీ తీసుకొస్తుంటుంది.

అలాగా! మరి మీ నాన్నగారు ఏం చేస్తుంటారు? అడిగాడు రాజా.

చాలీ చాలని జీతంతో ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో గుమస్తా ఉద్యోగం చేస్తూ కష్టపడి నన్ను చదివిస్తున్నాడు. నిజానికి స్కాలర్‌షిప్పే రాకపోతే మా నాన్న నన్ను చదివించలేక పోయేవాడు. తన ఇంటి పరిస్థితి బాధపడుతూ చెప్పింది అప్సర.

అరె బాగా చీకటి పడింది, వెళదాం అప్సరా! లేస్తూ అన్నాడు రాజా.

అప్సర అతన్ని అనుసరించింది.

వారం రోజులు పోయాక అప్సరకో ఉత్తరం అందింది. గబగబా విప్పి చదివింది.

అప్సర గారికి—

రాజా వ్రాయునది.

నేను ఈ వుత్తరం మా ఊరు నుంచి రాస్తున్నాను. మన ప్రేమ సంగతి, పెళ్ళి సంగతి నాన్నగారితో మాట్లాడాను. కానీ, ప్రయోజనం లేక పోయింది. ఆయనెవరో పెళ్ళి సంబంధం కుదిర్చారట. ఆ అమ్మాయిని తప్పించి మరొకర్ని పెళ్ళాడ్డానికి వీల్లేదంటున్నాడు. నేను మానాన్న మాట జవదాటలేను. దయ వుంచి మన పరిచయాన్ని స్నేహంగానే భావించి నన్ను మరచి పో!

ఇట్లు,
నీ అభాగ్యుడు, రాజా!

* * *

మరో నాలుగు రోజులు పోయిన తరువాత అప్సర దగ్గర నుండి రాజాగారికో ఉత్తరం అందింది.

రాజాగార్కి—

నిజానికి మీ ఉత్తరానికి ముందే మీ నిజస్వరూపాన్ని గ్రహించాను. ఆవేళ బీచ్‌లో నేను గుమస్తా కూతుర్ని, బీదదాన్ని అన్నప్పుడు మీ ముఖంలో రంగులు ఏలా మారాయో గ్రహించాను. రాజా గారూ! నేను సైకాలజీ చదవడమే కాదు—మనుషుల్నిగూడా యిట్టే చదువగలను తెలుసా?

నాకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయని మీకు తెలుసు. అందుచేతే మిమ్మల్ని మొదట్లో ప్రేమించక పోయినా, తరువాత మీరు వల్లించే ఆదర్శాలు విని మోసపోయి మిమ్మల్ని ప్రేమించాను. ఎందుకనో నాకు మిమ్మల్ని పరీక్ష చేయాలనిపించింది. ఆ కారణంగా చిన్న నాటకం ఆడాను. చిన్న కథ అల్లి నేను బీదదాన్ని, గుమస్తా కూతుర్నని చెప్పి అబద్ధం ఆడాను. నిజానికి మా నాన్నగారు ఉన్నతాధికారి. మా నాన్న తలుచుకుంటే మీలాంటి వాళ్ళను వందమందిని అవలీలగా కొనేయగలడు. నాక్కావలసింది డబ్బున్న వాడు కాదు, మంచి మనస్సు, మంచి ఆశయాలువున్న ఆదర్శమైన వ్యక్తి.

నేను కాదంటే సన్యాసుల్లో కలిసిపోతానన్న మీరు నా చేతికి ఏ గాజాగానో పుట్టవలసిన వాడినన్న మీరు నేను పేదయింటి దాన్ని అని చెప్పిన తరువాత మీ తండ్రిగారు నీకు మరో సంబంధం చూడ్డం, మీరు తండ్రిగారి మాట జవదాటలేక పోవడం, మీయొక్క నిజస్వరూపాన్ని బట్ట బయలు చేశాయి.

మీ వల్ల నేను నష్టపోకుండా ఇలా బయట పడ్డం నా అదృష్టమే. కాని, మీరు మాత్రం ఒక్క విషయం గుర్తించుకోండి—ప్రేమను కూడా వ్యాపార దృక్పథంతో చూసే మీలాంటి యువకులున్నంత వరకు ఈ దేశం బాగు పడదు. క్రొత్త జగతిని కోరే సరిక్రొత్త యువతరం మీలాంటి సంకుచిత భావాలున్న వాళ్ళను క్షమించదు.

గుడ్ బై మిస్టర్ రాజా!

ఇట్లు,
అప్సర.

ఉత్తరం పూర్తిగా చదివి నీరుకారిపోయాడు రాజా. "డామిట్" కథ అడ్డం తిరిగిందంటూ కూలబడిపోయాడు.